తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకుడు రాము యాదవ్ కూతురు పెండ్లి ఛే నంబర్‌లోని మహారాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పలువురు నాయకులు కేటీఆర్‌తో ఫొటోలు దిగేందుకు పోటీలు పడ్డారు. – అంబర్‌పేట, నవంబర్ 20

బహుళ అంతస్తులకు అనుమతులేవీ?

- నిర్మాణ అనుమతుల్లో హెచ్ఎండీఏలో నెలకొన్న సందిగ్ధం
- ఎంఎస్‌బీ సమావేశం జరుపని అధికారులు
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతుందంటున్న నిపుణులు

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో బడా ప్రాజెక్టుల నిర్మాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. కాసులు కురిపించే హైరైజ్ ప్రాజెక్టుల విషయంలో అధికారులు ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. మామూలు భవనాలకే ముప్ప తిప్పలు పెట్టే యంత్రాంగం హెచ్ఎండీఏలో ఉండగా... తాజాగా షాడో నేతల ప్రమేయంతో సామాన్యుడి సొంతింటి కల మరింత కఠినంగా మారింది. అయితే మల్టీ స్టోరైడ్ బిల్డింగులు(ఎంఎస్‌బీ) విషయంలో ఉన్నతాధికారులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. ప్రాజెక్టుల అనుమతుల కోసం వారం, 15 రోజులకొసారి జరిగే ఎంఎస్‌బీ సమావేశాలు జరగడం లేదు. దీంతో అనుమతుల కోసం చెప్పులు అరిగేలా తిరిగినా కూడా ప్రయోజనం లేకుండా పోతుంది. రోజులు గడుస్తున్నా.. సమావేశాలు నిర్వహించకపోవడంతో దరఖాస్తులన్నీ పేరుకుపోతున్నాయి. దరఖాస్తులను క్లియర్ చేయాల్సిన ఉన్నతాధికారులు మీటింగులను ఏర్పాటు చేయకపోవడంతో కొత్త సమస్యలు వస్తున్నాయి.

ప్రాజెక్టులను తొక్కి పెట్టిన కాంగ్రెస్

ఎన్నికలకు ముందు హెచ్ఎండీఏ పరిధిలో నిర్మిస్తున్న హైరైజ్ ప్రాజెక్టుల విషయంలో రాద్ధాంతం చేసిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు విషయంలో మీనవేషాలు వేస్తున్నారు. హైరైజ్ ప్రాజెక్టుల పేరిట బీఆర్ఎస్ అక్రమాలకు పాల్పడుతుందంటూ నాడు వ్యాఖ్యలు చేసి.. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే హైరైజ్ ప్రాజెక్టులను కాంగ్రెస్ తొక్కి పెట్టేస్తోంది. దీంతో గడిచిన ఏడాది కాలంగా హెచ్ఎండీఏ పరిధిలో ఎంఎస్‌బీల అనుమతుల ప్రక్రియ అగమ్యగోచరంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఓఆర్ఆర్ వెంబడి భారీ ప్రాజెక్టులకు రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రణాళికలు రూపొందిస్తున్నా.. అనుమతులు రాకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి.

సమావేశాలకు దూరం...

నిబంధనల ప్రకారం హెచ్ఎండీఏ పరిధిలో అనుమతుల కోసం వచ్చే ఎంఎస్‌బీల దరఖాస్తుల క్లియరెన్స్‌కు వారం, 10రోజులకోసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల నగరంలో నెలకొన్న హైడ్రా, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ వివాదాల నేపథ్యంలో ఎంఎస్బీలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిసింది. సమీపంలో నాలా, చెరువులు ఉంటే 18 మీటర్ల ఎత్తు కంటే ఎక్కువ ఉంటే అనుమతులు తప్పనిసరి చేయాల్సి ఉండగా, ఎంఎస్‌బీల సమావేశం లేకపోవడంతో జాప్యం జరుగుతున్నది. రియల్ ఎస్టేట్ రంగానికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నగరంలో అనుమతులను నిలిపివేస్తే క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఉత్తమ బస్‌స్టేషన్‌గా కాచిగూడ ఎంపిక

కాచిగూడ డిపో మేనేజర్ రఘుకు నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న రీజినల్ మేనేజర్ వరప్రసాద్, తదితరులు

కాచిగూడ, నవంబర్ 20: ఆర్టీసీ ప్రయాణికులకు ఉత్తమ సేవలందించినందుకు గాను హైదరాబాద్ రీజియన్‌లోని 14 డిపోలలో ఉత్తమ బస్‌స్టేషన్‌గా కాచిగూడ బస్‌స్టేషన్ ఎంపిక అయ్యింది. బుధవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘుకు నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఉత్తమ బస్‌స్టేషన్‌గా కాచిగూడను ఎంపిన చేసినందుకు ఆర్టీసీ ఎండీ, చైర్మన్, సంస్థ ఉన్నతాధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్స్ సుచరిత, జగన్, బాబునాయక్, 14 డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 20: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీఆర్ఎస్వీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం తుంగ బాలు విలేకరులతో మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కడారి స్వామియాదవ్, బూరుగు నవీన్‌గౌడ్, చటారి దశరథ్, జంగయ్య, శ్రీకాంత్‌గౌడ్, కొంపల్లి నరేశ్, రమేశ్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో...

హిమాయత్‌నగర్ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని నిరసిస్తూ బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద కండ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు లెనిన్, అనిల్ కుమార్, హర్ష, పవన్, వెంకట్, శింబు, వంశీ, విజయ్, మస్తాన్, అరుణ్, మనోజ్, శివకుమార్, రంజిత్‌కుమార్, సుదర్శన్, రఘు, రాజేందర్, అశోక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద కండ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేస్తున్న నేతలు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేసే కుట్రలు మానుకోవాలి

బషీర్‌బాగ్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

సుల్తాన్‌బజార్, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (పీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, ఎ.కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ చౌరస్తాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలలో కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యపు వైఖరిని నిరసిస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో లక్షలాది మంది పేద విద్యార్థులు చదువులకు దూరం అయ్యారని విమర్శించారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో, యూనివర్సిటీలలో లెక్చరర్ పోస్టులు, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.హరీశ్, రాజశేఖర్, కోట ఆనంద్, విద్యార్థులు లక్ష్మీకాంత్, పవన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జోయాలుక్కాస్ వివాహ ఉత్సవ్

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): పెండ్లిళ్ల సీజన్ సందర్భంగా జ్యువెల్లరీ పరిశ్రమలో పేరుగాంచిన జోయాలుక్కాస్ సంస్థ నవంబర్ 15 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ప్రత్యేకమైన జోయాలుక్కాస్ వివాహ ఉత్సవ్‌ను ప్రకటించింది. ఈ ఉత్సవ్‌లో పెండ్లి కుమార్తెలు, వారి కుటుంబాలకు ఆకర్షణీయమైన ఆఫర్లు, విస్తృత శ్రేణి బ్రైడల్ కలెక్షన్స్‌ను అందిస్తున్నది. ఈ ఉత్సవ్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లతోపాటు డైమండ్లు, ప్రెషస్ స్టోన్స్‌పై ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మల్కాజిగిరిలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరిలో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ నూతన షోరూమ్‌ను బుధవారం ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు ప్రారంభించారు. షామీర్‌పేట్ రత్నాలయం వైస్ చైర్మన్ రమా వెంకటేశ్ షోరూమ్‌లో తొలి కొనుగోలు చేశారు. దేశవ్యాప్తంగా రామ్‌రాజ్ కాటన్‌కు విశేష ఆదరణ ఉందని, పిల్లల నుంచి పెద్దల వరకు రామ్‌రాజ్ పంచెలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ నాగరాజన్ తెలిపారు. కంపెనీ 300వ షోరూమ్ మల్కాజిగిరిలో ఏర్పాటు చేశామని, పెండ్లిళ్లకు సరసమైన ధరలో పట్టుబట్టలు అందుబాటులో ఉంటాయని, తమను ఆదరిస్తున్న వినియోగదారులకు చైర్మన్ నాగరాజన్ కృతజ్ఞతలు తెలిపారు.

23న కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ పర్యటన

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందించేందుకు కలెక్టరేట్‌లో ఈనెల 23వ తేదీన బీసీ కమిషన్ బృందం పర్యటించనున్నది. ఈ సమావేశంలో బీసీ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని హైదరాబాద్ డీఆర్ఓ వెంకటాచారి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ బీసీ కమిషన్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల 23న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు

జవహర్‌నగర్, నవంబర్ 20 : సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు అండర్-8, 10, 12 బాల బాలికలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పుట్టినరోజు సర్టిఫికెట్‌తో ఈనెల 23వ తేదీన సీఆర్‌పీఎఫ్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 8గంటల వరకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు డిసెంబర్ 1వ తేదీన మంచిర్యాలలో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

సీవరేజీ డీ సిల్టింగ్ పనులు ఈడీ పరిశీలన

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ డివిజన్ 4లోని ఫీల్ ఖానా ప్రాంతంలో పర్యటించారు. సీవరేజీ డీ సిల్టింగ్ పనులను ఈడీ తనిఖీ చేశారు. సీవరేజీ ఔట్‌లెట్ సమస్య, ఏఎంఎస్ కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. గౌలిగూడ సెక్షన్‌లో బిల్లింగ్ కలెక్షన్స్, మీటర్ రీడర్స్ పనితీరు, ఓటీఎస్ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈడీ వెంట జీఎం, డీజీఎం, మేనేజన్లు ఉన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి పశురక్త మార్పిడి కేంద్రం

పశురక్త మార్పిడి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపకులపతి, ఐఏఎస్ డా. సభ్యసాచి ఘోష్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 20: పశు రక్త మార్పిడి కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి ప్రారంభిస్తున్నామని, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఐఏఎస్ డా. సభ్యసాచి ఘోష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల, వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు అనతికాలంలోనే పశువైద్యంలో విప్లవాత్మక మార్పు వచ్చిందని, మనిషులకు చేసినట్లుగానే పశువులకు కూడా వినూత్న పశువైద్యానికి ఏర్పాటు చేసిన క్లీనిక్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ సౌజన్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి ఇలాంటి సదుపాయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సదుపాయం రక్తహీనత కలిగిన పశువులకు, ప్రమాదంలో తీవ్ర రక్తస్రావం కలిగిన పశువులకు, వివిధ రోగాల బారినపడిన పశువులకు రక్త మార్పిడి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. రాష్ట్రంలోని రైతు తమ పెంపుడు పశువులకు, పశు పెంపకందారులు, పెంపుడు కుక్కలు, పిల్లుల యాజమాన్యం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పశుపోషణపై రైతులకు ఎక్కువగా ఆసక్తి పెరిగిందన్నారు. పశువులు అస్వస్థతకు గురి కాగానే రాజేంద్రనగర్‌లోని క్లీనిక్‌ను సంప్రదిస్తున్నారన్నారు. రక్తమార్పిడి కేంద్రం ప్రారంభంతో మరిన్ని అవకాశాలు పెరిగాయని సూచించారు. డీన్ డా.రఘునందన్, స్టూడెంట్ వెల్ఫేర్ అధికారి డా. చిన్ని ప్రీతమ్, విస్తరణ సంచాలకులు డా.మహేందర్, పరీక్షల అధికారి డా. గోపాల్‌రెడ్డి, ప్రదీప్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉదయ్‌కుమార్, డా. రామచంద్రారెడ్డి, డా. సతీశ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త చుక్కా రామయ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు

అంబర్‌పేట/సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పుట్టిన రోజు వేడుక బుధవారం విద్యానగర్‌లోని ఆయన స్వగృహంలో నిరాడంబరంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఇంట్లో కలిసి పూలబొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, మాజీ మంత్రి జానారెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, మల్లెపల్లి లక్ష్మయ్య, హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, అభిమానులు, అనుచరులు, శిష్యులు తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చుక్కా రామయ్యకు భారతీయతకు భాష్యం(సీతారాం ఏచూరి) పుస్తకాన్ని ప్రదానం చేశారు.

నీలోఫర్‌లో పార్కింగ్‌కు అనుమతించండి

నీలోఫర్ ఆస్పత్రి వద్ద డాక్టర్లు, ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

మెహిదీపట్నం, నవంబర్ 20 : ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీలోఫర్ ఆస్పత్రిలో పార్కింగ్‌కు అనుమతి ఇవ్వాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ముందు పార్కింగ్, అక్రమ వ్యాపారాల కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ చేసిన ఫిర్యాదుతో నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు నీలోఫర్ ఆస్పత్రి ముందు పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. దీనిపై సమాచారం అందుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ హుటాహుటిన అక్కడకు చేరుకుని ట్రాఫిక్ పోలీసుల తీరుపై మండిపడ్డారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ వారు చేయాల్సిన పనులను ట్రాఫిక్ పోలీసులు ఎప్పటి నుంచి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలను పిలిచి ఆస్పత్రి లోపల ఖాళీ స్థలం ఉన్నందున పార్కింగ్‌కు అనుమతి ఇవ్వాలని సూచించారు. అంతే కాకుండా పేద వారి జోలికి వస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన పుట్‌పాత్ వ్యాపారాలను మరల పెట్టుకునేలా ఎమ్మెల్యే చొరవ తీసుకున్నారు.

తెలంగాణ గిరిజన సహకార సంస్థ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సీతారాం

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): తెలంగాణ గిరిజన సహకార సంస్థ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సీతారాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణగౌడ్ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన తెలంగాణ గిరిజన సహకార సంస్థ అధికారుల సంఘం సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జీటీ.జీవన్ అభినందనలు తెలిపారు.

నేడు, రేపు నగరంలో రాష్ట్రపతి పర్యటన

ఆయా రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): నగరంలో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఈనెల 21, 22తేదీల్లో ఆయా రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. అలాగే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనూ ఆంక్షలు కొనసాగనున్నాయి.

- 21వ తేదీ గురువారం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు బేగంపేట్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, శ్యాం లాల్ బిల్డింగ్, మొనప్పజంక్షన్, యశోద హాస్పిటల్, రాజ్‌భవన్‌రోడ్డు, వీవీ విగ్రహం ఖైరతాబాద్, నెక్లెస్‌రోడ్డు, ఓల్డ్ అంబేద్కర్ జంక్షన్, ఎన్టీఆర్ స్టేడియం, అశోక్‌నగర్ జంక్షన్ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలుంటాయి.
- 22వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు రాజ్‌భవన్ రోడ్డు, వీవీ విగ్రహం, తాజ్ కృష్ణ, ఎన్ఎఫ్‌సీఎల్, సాగర్ సొసైటీ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, రోడ్డు నం.45 జంక్షన్, కేబుల్ బ్రిడ్జి నుంచి మినాక్షి, ఎన్ఐఏ నుంచి ఐకియా, బయోడైవర్సిటీ నుంచి సైబర్ టవర్స్, మాదాపూర్ నుంచి కొత్తగూడ వరకు ట్రాఫిక్ ఆంక్షలుంటాయి. అక్కడి నుంచి తిరుగు పయనం రోడ్డు నం.65, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మీదుగా బేగంపేట్ ఎయిర్‌పోర్టు వరకు ఈ ఆంక్షలు కొనసాగనున్నాయి.

గ్లోబల్ హెల్త్‌కేర్‌కు భారతీయ ఔషధ రంగం సహకారం

ఎంఎస్ మాస్టర్స్ పూర్తి చేసిన విద్యార్థినికి బంగారు పతకం పట్టాను అందజేస్తున్న నైఫర్ బోర్డ్‌ఆఫ్ గవర్నర్స్ సత్యనారాయణ చావా

బాలానగర్, నవంబర్ 20: గ్లోబల్ హెల్త్‌కేర్‌కు భారతీయ ఔషధ రంగం గణనీయమైన సహకారాన్ని అందిస్తుందని నైఫర్ హైదరాబాద్ బోర్డ్‌ఆఫ్ గవర్నర్స్, లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ సత్యనారాయణ చావా అన్నారు. బుధవారం బాలానగర్ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైఫర్)లో నైఫర్ డైరెక్టర్ శైలేంధ్ర శరాఫ్ అధ్యక్షతన జరిగిన 12వ స్నాతకోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాస్యూటికల్స్, టెక్నాలజీ భవిష్యత్‌ను రూపొందించడంలో నైఫర్ గ్రాడ్యుయేట్లు కీలక పాత్రను పోషించనున్నారని స్పష్టం చేశారు. అనంతరం ఎంఎస్ మాస్టర్స్ పూర్తి చేసిన 179 మంది విద్యార్థులకు పట్టాలు, 12 మందికి బంగారు పతకాలను అందజేశారు. అదేవిధంగా మరో 9మంది విద్యార్థులు పీహెచ్‌డీలుగా పట్టాలు అందుకున్నారు. కార్యక్రమంలో నైఫర్ డీన్ ప్రొఫెసర్ నండూరి శ్రీనివాస్, రిజిస్ట్రార్ బి.లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌ను వణికిస్తున్న చలి

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండటంతో చలిపులి నగరాన్ని వణికిస్తున్నది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.8 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.1 డిగ్రీలు, గాలిలో తేమ 45 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.9 డిగ్రీలు పడిపోయి 15.1 డిగ్రీలుగా నమోదవడంతో చలిపులి గ్రేటర్‌ను వణికిస్తున్నది.

గ్రేటర్‌లో 57.30 శాతం కుటుంబాల సర్వే పూర్తి

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సర్వే కొనసాగుతున్నది. సర్వేలో సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు, ఉద్యోగ విరమణ పొందిన ఐఏఎస్‌లు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సర్వే సిబ్బంది పూర్తి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం 1,32,656 కుటుంబాల సర్వే పూర్తి కాగా, ఇప్పటి వరకు 13,91,817 కుటుంబాల సర్వే పూర్తి (57.30శాతం)చేసినట్లు అధికారులు తెలిపారు.